ఐఐహెచ్‌టీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఇటీవలే కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరంలో ఐఐహెచ్‌టీ మూడేళ్ల డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు చేనేత జౌళిశాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. సెప్టెంబరు 18న పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో కోర్సు ప్రారంభమవుతుందని చేనేత జౌళిశాఖ తెలిపింది. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఎస్సీ, ఎస్టీలకు 25 ఏండ్ల గరిష్ట వయో పరిమితి విధించినట్టు తెలిపింది. నెలకు రూ. 2500 స్టైఫండ్ అందించనున్నట్టు వివరించింది. పోచంపల్లి మండలం కమముక్కలహ్యాండ్లూమ్ పార్క్‌లో ఐఐహెచ్‌టీకి శాశ్వత భవనం నిర్మిస్తున్నట్టు పేర్కొంది.

'గాంధీ'లో మరో పీజీ కోర్సు

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో మరో పీజీ కోర్సుకు ఎన్ఎంసీ అనుమతి ఇచ్చింది. జీరియాట్రిక్స్‌లో పీజీ(ఎండీ) కోర్సును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ బీఎన్ గంగాధర్ నేతృత్వంలోని ఎన్ఎంసీ అప్పీల్ కమిటీ గత నెల 12న దరఖాస్తు పరిశీలించి, నాలుగు సీట్లు మంజూరు చేసింది.

ఏఈఈ పోస్టుల ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏఈఈ పోస్టుల భర్తీకి సంబంధించిన ఫలితాలు శుక్రవారం విడుదల చేసినట్టు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. 1154 పోస్టుల ఫలితాలు (ప్రొవిజనల్లి సెలెక్టెడ్ క్యాండిడేట్స్) విడుదల చేసినట్టు పేర్కొన్నారు. ఫలితాలు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని చెప్పారు.

మెడికల్ లీవ్‌లో రోస్

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఇంధన శాఖ కార్యదర్శి, టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్ 5 నుంచి 17 వరకు మెడికల్‌లీవ్‌లో వెళ్లనుండగా ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు అదనపు బాధ్యతలప్పగించింది.

తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

అక్రమ అరెస్ట్‌లపై కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్‌లు

పెండింగ్ బిల్లులడిగితే అరెస్టు చేస్తరా?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ సర్పంచుల కన్నెర్ర
- రాష్ట్రవ్యాప్తంగా 6వేల మంది అదుపులోకి..
- మాజీ సర్పంచులకు బీఆర్ఎస్ సంఘీభావం
- స్టేషన్లలో హరీశ్‌రావు, గంగుల పరామర్శ

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ)/బొల్లారం: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనే ప్రధాన డిమాండ్‌తో మాజీ సర్పంచులు సచివాలయం ఎదుట శుక్రవారం నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. దీక్షలో పాల్గొనడానికి రాష్ట్ర నలుమూలల నుంచి హైదరాబాద్‌కు తరలివస్తున్న 6,000 మంది మాజీ సర్పంచులను పోలీసులు మార్గమధ్యంలోనే అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్‌ను సచివాలయం సమీపంలో అరెస్టు చేసి వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి తాము ఖర్చుచేసిన పెండింగు బిల్లులు చెల్లించాలని అడిగితే అక్రమంగా అరెస్టు చేస్తారా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. సుమారు రూ.1500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్నా ఇంకా ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. అప్పులబాధ తాళలేక పలువురు మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. గాంధేయమార్గంలో సచివాలయం ఎదుట తలపెట్టిన నిరసన దీక్షకు పోలీసులు అడుగడుగునా అడ్డుతగిలి అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని, ఇలాంటి చర్యలతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. పెండింగు బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 1,800 మంది మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టుచేసి 14 పోలీస్‌స్టేషన్లకు తరలించారు. తిరుమలగిరి, బొల్లారం పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించిన గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్యగౌడ్ తదితరులను మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు కలిసి సంఘీభావం ప్రకటించారు. అరెస్టయిన వారిలో సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచులను బంధించడం సిగ్గుచేటు: హరీశ్

బొల్లారం, ఆగస్టు 2: తమ సొంత ఖర్చులతో గ్రామాల అభివృద్ధికి విశేషంగా పాటుపడిన మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వమేనని, చేతల ప్రభుత్వం కాదని మండిపడ్డారు. ప్రస్తుతం గ్రామల్లో పారిశుద్ధ్య నిర్వహణ లేక ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాప్తిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గామాల్లో చెత్త ఎత్తే ట్రాక్టరుకు డీజిల్ పోసే దిక్కులేదని, వీధి లైట్లు వేసే పరిస్థితి లేదని మండిపడ్డారు. నిధులు విడుదల చేయకపోవడంతో మాజీ సర్పంచులు అప్పులభారం తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి ఏర్పడిందని చెప్పారు. '8 నెలల కాంగ్రెస్ పాలనలో 8 పైసలైనా గ్రామాలభివృద్ధికి ఖర్చు పెట్టకపోగా, ఢిల్లీ నుంచి వచ్చిన రూ.800 కోట్ల నరేగా నిధులు, రూ.500 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను మీరే ఆపుకున్నరు, నెలా నెలా ఇవ్వాల్సిన పల్లెప్రగతి డబ్బులు బంద్ చేశారు' అని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీల పెండింగ్ బిల్లులను చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల అరెస్ట్‌లను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	33.6°c	23.4°c
ఖమ్మం	32.0°c	25.0°c
రంగారెడ్డి	31.9°c	22.5°c
మెదక్	31.9°c	22.8°c
వరంగల్	31.5°c	23.5°c
హైదరాబాద్	30.7°c	24.5°c
నిజామాబాద్	29.9°c	24.2°c
మహబూబ్‌నగర్	29.5°c	23.0°c
నల్లగొండ	29.5°c	24.0°c
కరీంనగర్	28.0°c	25.0°c

మరో 4 రోజులు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఇటు రుతుపవనాలు, అటు అరేబియా సముద్రంలో తుఫాను ప్రభావంతో ఈ వానలు పడుతాయని తెలిపింది. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురువొచ్చని వెల్లడించింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మరోవైపు గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలో మోస్తరు వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 5.02 సెంటీమీటర్ల వాన పడింది.

బీసీ గురుకులంలో యానిమేషన్ కోర్సు

17వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు2 (నమస్తే తెలంగాణ): జ్యోతిబా పూలే బీసీ గురుకులం పరిధిలోని చేవెళ్ల ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీఏ యానిమేషన్ కోర్సు అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి బీ సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కోర్సులో ప్రవేశానికి శనివారం నుంచి ఈ నెల 17వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు వెల్లడించారు. ఇంటర్ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు సొసైటీ వెబ్‌సైట్ లేదా 9032 644463, 9063242329 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్

ఓబీసీలకు 52% రిజర్వేషన్లు కల్పించాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థి నేత కిరణ్‌కుమార్
- 7న జరిగే చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి ఓబీసీలకు 52 శాతం రిజర్వేషన్లకు పెంచాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 7న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని వర్సిటీలలో ఓబీసీ అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. రాజకీయాల్లో ఓబీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ఆ వర్గాలకు తగు న్యాయం చేసేందుకు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నేత రాకేశ్, శివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గుర్తుచేశారు. తీర్పును అమలు చేయడానికి అవసరమైన అని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.సుప్రీంకోర్టు తీర్పులో ఎస్సీలలో మరింత వెనుకబడిన కులాలకు విడివిడిగా కోటాలు ఇచ్చుకోవడానికి అనుమతించడం సానుకూల అంశమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీలోని వెనుకబడిన కులాలను విధాన నిర్ణయాల పరిధిలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణ ద్వారా వచ్చే రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వర్తింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. బీసీల్లో కూడా అత్యంత వెనుకబడిన కులాలు (ఎంబీసీ) కడు పేదరికం అనుభవిస్తున్నాయని, రిజర్వేషన్ల ఫలితాలు అన్ని తరగతులకు దక్కాలంటే బీసీల్లోనూ వర్గీకరణ చేపట్టాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ ఢిల్లీలో 3 రోజులు నిరసన
- మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య వెల్లడి

మీడియాతో సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

హైదరాబాద్ (హిమాయత్‌నగర్), ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య తెలిపారు. వీటిని విజయవంతం చేయడానికి మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రిజర్వేషన్లకు భంగం కలిగించేలా ఉన్నదని చెప్పారు. ఈ తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని, తీర్పును పునఃపరిశీలించాలని కోరుతామని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావు, ఉపాధ్యక్షుడు టీ రమేశ్, కార్యదర్శి జే గణేశ్, మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ గోపోజు రమేశ్, గ్రేటర్ అధ్యక్షుడు బీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జీ కల్యాణ్, ప్రధాన కార్యదర్శి ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎన్నో ఏండ్ల పోరాటం ఫలించింది

- వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
- టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి

హైదరాబాద్ (సిటీబ్యూరో), ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడం చాలా సంతోషంగా ఉన్నదని, ఎన్నో ఏండ్ల నుంచి తాము చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర జనాభాకు అనుకూలంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్మికులు అరకొర జీతాల తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వీరికి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని వెల్లడించారు. దళితుల వద్ద ఉన్న అసైన్డ్ భూములకు రెగ్యులర్ పట్టాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రొఫెసర్ పురుషోత్తం, యతాకుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనకు ఆదేశాలివ్వాలి

బీసీ సంక్షేమ సంఘం నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, అదే తరహాలో బీసీ కులగణనకు సుప్రీంకోర్టు కేంద్రానికి ఆదేశాలివ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న అఖిల భారత ఓబీసీ 9వ మహాసభల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం సచివాలయ మీడియా పాయింట్‌లో జాజుల ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ కాలంగా ఒకే నినాదంతో పోరాడి విజయం సాధించిన మందకృష్ణ మాదిగకు బీసీ సమాజం నుంచి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర కులగణన జరిపి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని బీసీలు చేస్తున్న పోరాటాన్ని గుర్తుచేశారు. బీసీల ఆకాంక్షలను గౌరవించి కేంద్ర ప్రభుత్వం ఇకనైనా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీల మహాధర్నా చేపట్టనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పుపై రేవంత్ తీరు బాధాకరం

మాల మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి కుమార్ మాల

జనగామ, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : సుప్రీంకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేయకుండానే వర్గీకరణ అమలు చేసే బాధ్యత తమదేనని, అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరికాదని మాల మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి తాటి కుమార్ మాల అన్నారు. శుక్రవారం ఆయన జనగామలో మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపించిన మాలలను రేవంత్‌రెడ్డి విస్మరించి.. మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో బీజేపీకి మద్దతుగా పని చేసిన మాదిగల పక్షాన అసెంబ్లీలో కాంగ్రెస్ ఏకపక్షంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. తమ వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని చెబుతున్న రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పూర్తిగా అధ్యయనం చేసి అసెంబ్లీలో చర్చ జరిపిన తర్వాత ప్రకటన చేసి ఉంటే బాగుండేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును ఏ విధంగా అమలు చేస్తారో ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రాయపర్తిలో వర్గీకరణకు వ్యతిరేకంగా నినదిస్తున్న మాల మహానాడు నేతలు

వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం

మాల మహానాడు ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు వీరస్వామి

రాయపర్తి, ఆగస్టు 2: వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టుతో తీర్పుతో రాష్ట్రంలోని మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని మాల మహానాడు ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు కముటం వీరస్వామి, మండల అధ్యక్షుడు ఉబ్బని సింహాద్రి ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తిలోని మాల కమ్యూనిటీ హాల్ ఆవరణలో మాలలతో కలిసి సుప్రీం తీర్పు, కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మాలలకు న్యాయం చేయాలని కోరారు.

- సుప్రీం తీర్పుపై దళితుల సంబురాలు

ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పు ఇవ్వడంపై ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో దళితులు సంబురాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించడం ఆనందంగా ఉన్నదన్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్స్, విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ ఉపకులాలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు.

– నిజామాబాద్/కరీంనగర్

సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

ఏటా 6.5 లక్షల కొత్త ఆయకట్టు సృష్టి

- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి
- సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ఏటా కొత్తగా ఆరు లక్షల నుంచి ఆరున్నర లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టిస్తామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఐదేండ్లల్లో 35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు భారీగా వరద వస్తున్న నేపథ్యంలో సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుతోపాటు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు, దాని పరిధిలోని లోలెవల్ కెనాల్‌కు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం సాగునీటిని విడుదల చేశారు. పెద్దవూర మండలం పొట్టిచెల్మ హెడ్ రెగ్యులేటరీ వద్ద స్విచ్ ఆన్ చేసి కాల్వలోకి నీటిని వదిలారు. అనంతరం విజయవిహార్‌లోని అతిథిగృహంలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎడమ కాల్వకు 11 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం సొరంగ మార్గాన్ని పూర్తి చేసి ఏఎమ్మార్పీ పరిధిలోని 3.75 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తామని, డిండి ప్రాజెక్టును కూడా పూర్తి చేసి జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటామని తెలిపారు.

మంత్రి ఉత్తమ్ తడబాటు

నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నీటి విడుదలపై మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ తడబాటుకు గురయ్యారు. పదేండ్ల నుంచి ఇంత తొందరగా సాగర్ నీళ్లు ఎన్నడూ వదలి పెట్టలేదని, పూర్తి కెపాసిటీతో నీళ్లు వదలిపెట్టడం జరుగుతుంది చెప్పుకొచ్చారు. 2022లో ఇంతకు ఐదు రోజుల ముందే అప్పటి కేసీఆర్ సర్కార్ సాగునీటిని విడుదల చేసిందనేది సాగర్ ప్రాజెక్టు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. మంత్రి అవాస్తవాలను వెల్లడించడంపై అక్కడ ఉన్న మీడియాతోపాటు అధికారులు విస్మయం వ్యక్తంచేశారు.

నేటి నుంచి సీఎం విదేశీ పర్యటన

10రోజులపాటు అమెరికా, దక్షిణకొరియాలో..

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా, దక్షిణకొరియా పర్యటన శనివారం తెల్లవారుజామున ప్రారంభమైంది. ఆయన వెంట ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం వ్యక్తిగత సిబ్బంది వెళ్లారు. ఉదయం 4:35 గంటలకు శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరారు. ఈనెల 10వ తేదీ వరకు అమెరికాలో, 11నుంచి దక్షిణకొరియాలో పర్యటిస్తారు. తిరిగి 14న ఉదయం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

'ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలపై చర్యలేవీ'

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): నిబంధనలు పాటించని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు, వర్సిటీలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నేతలు ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాంను కోరారు. ఏబీవీపీ ప్రతినిధి బృందం సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రైవేట్‌వర్సిటీలు ఇష్టారీతిన సీట్లు పెంచుకుంటున్నాయని, ఫ్యాకల్టీ లేకపోయినా, ఒకే ఫ్యాకల్టీని రెండింటిలో చూపిస్తున్నాయని, ఆయా కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ నగర కార్యదర్శి శ్రీకాంత్, మహానగర సంఘటనా మంత్రి రాజశేఖర్ ఉన్నారు.